క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కూసుమంచి: రైతులకు తొలి విడతలో రూ.లక్ష రుణమాఫీ చేసినందుకు శనివారం మండలంలోని గట్టుసింగారం గ్రామంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ చేస్తున్నారని, రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్లవేళలా రుణపడి ఉంటారని నాయకులు పేర్కొన్నారు.

'బ్లూమింగ్ మైండ్స్'లో రెడ్ కలర్ డే



ఎరుపు దుస్తులు ధరించిన చిన్నారులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లి బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్‌లో శనివారం రెడ్ కలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఎరుపు రంగు దుస్తులు ధరించగా.. అదే కలర్‌లో తరగతి గదుల్లో బెలూన్లు, వివిధ రకాల కూరగాయలు, పండ్లు సైతం ప్రదర్శించారు. అనంతరం ఎరుపు పండ్లలో ఉండే పోషకాలపై పాఠశాల కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెడార్ వ్యాలీ స్కూల్లో ఫ్రాన్స్ నేషనల్ డే



వేడుకలను ప్రారంభిస్తున్న పార్వతీరెడ్డి

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో నూతన కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సెడార్ వ్యాలీ స్కూల్‌లో శనివారం ఫ్రాన్స్ నేషనల్ (బ్యాస్టిల్ డే) వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుత్, డైరెక్టర్ ఆర్.పార్వతీరెడ్డి, హెచ్‌ఎం డాక్టర్ సాధనపాండే, అకడమిక్ డైరెక్టర్ బి.జగదీష్‌బాబులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

రుణమాఫీపై రైతులతో డీఏఓ ముఖాముఖి

రఘునాథపాలెం: రఘునాథపాలెం పీఏసీఎస్‌లో శనివారం జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల రుణమాఫీ అమలైన రైతులతో సమావేశమయ్యారు. ఎంతమేర రుణం తీసుకున్నారు, ఎంత మాఫీ అయిందనే వివరాలు ఆరాతీశారు. ఈమేరకు పలువురు రైతులు రుణమాఫీ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తాతా రఘురాం, ఖమ్మం ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీలు ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డికొమరయ్య చిత్ర నిర్మాణ నియోజకవర్గాల నూతన కమిటీలను శనివారం ఖమ్మం చెరువుబజార్‌లోని సంఘ కార్యాలయంలో ఎన్నుకున్నారు. చిత్ర నిర్మాణ కమిటీ జిల్లా కన్వీనర్ షేక్ అబ్దుల్ రెహమాన్ అధ్యక్షతన పాలేరు, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల చైర్మన్లుగా పెరుగు వెంకటరమణయాదవ్, భూక్యా కృష్ణ, దేవళ్ల నాగేశ్వరరావు, ఎక్కిరాల శ్రీనివాసరావు, కో చైర్మన్లుగా భూక్యా ఉపేంద్రబాయి, కొమ్ము రమేష్, కన్వీనర్లుగా దామల్ల జయ, వల్లెపు సోమరాజు, కో కన్వీనర్‌లుగా షేక్.యాసిన్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో పగిడిపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో బుగ్గవీటి సరళ అధ్యక్షతన జరిగిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళకు రూ.2,500లు, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, ఇళ్లు లేని పేదలకు గృహలక్ష్మి పేరుతో రూ.5 లక్షలు, కల్యాణమస్తు పథకం వంటివి ఇస్తామని ప్రకటించి నేటికి అమలు చేయలేదని, వెంటనే వాటిని అమలు చేయాలని కోరారు. మహిళలను చైతన్యం చేసేందుకు రాష్ట్రస్థాయి క్లాసులను ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు కరీంనగర్ జిల్లాలో నిర్వహిస్తున్నామని, వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు మెరుగు రమణ, నాయకులు మెహరున్నిసా బేగం, పత్తిపాక నాగసులోచన, కత్తుల అమరావతి, భాగం అజిత, బీబీ, రమ, కుమారి తదితరులు పాల్గొన్నారు.



మమతా రోడ్డులో వర్షపునీరు పోయేందుకు డివైడర్‌ను తవ్వుతున్న కేఎంసీ సిబ్బంది



సెంట్రల్ క్రైం స్టేషన్ వద్ద డ్రెయినేజీల్లో వ్యర్థాలను తొలగిస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది



దానవాయిగూడెంలో ఖాళీ ప్రదేశాల్లో నీటిని తొలగించేందుకు కచ్చా కాల్వలు తీస్తున్న జేసీబీ

చినుకు పడితే చింతే..

- నగరంలో రోడ్లపైనే వర్షపు నీరు
- పొంగుతున్న డ్రెయినేజీలు, లోతట్టు ప్రాంతాల్లో నిలుస్తున్న వరద
- కేఎంసీలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ



లకారం వద్ద రోడ్డుపై నిలిచిన నీటిని మిషన్ల ద్వారా తోడుతున్న కేఎంసీ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: అభివృద్ధి చెందిన నగరంగా చెప్పుకుంటున్న ఖమ్మంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కొద్దిపాటి వర్షం కురిసినా డ్రెయినేజీలోని మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నగరంలోని రోడ్లన్నీ జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వరద నీరు బయటకు పోయేందుకు వీలు లేక రోడ్లపైనే నిలుస్తుండడంతో ఆ నీటిని తొలగించేందుకు కేఎంసీ సిబ్బంది మిషన్లను వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో లక్షలాది రూపాయలతో డ్రెయినేజీలు కట్టినా, మరి కొన్ని ప్రాంతాల్లో వాటిని శుభ్రం చేయకపోవడంతో వరద నీరంతా రోడ్లపైకి చేరి అధ్వానంగా తయారైంది.

రోడ్లు, ఖాళీ స్థలాల్లో నీరు..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నగరంలోని మమత రోడ్డు, ఐటీహబ్, కమాన్‌బజార్, బుర్హాన్‌పురం, సెంట్రల్ క్రైం స్టేషన్, లకారం చెరువు పీవీ నర్సింహారావు విగ్రహం వద్ద, పాత బస్టాండ్, దానవాయిగూడెం, కాల్వొడ్డు ప్రాంతాల్లో రోడ్లపైకి, లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరుతోంది. మమత రోడ్డులో రోడ్డు కిందికి, డ్రెయినేజీ పైకి ఉండడంతో వర్షపు నీరు డ్రెయినేజీలోకి వెళ్లడం లేదు. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని డీఆర్‌ఎఫ్ సిబ్బంది, కేఎంసీ కార్మికులు ట్రాక్టర్ల ట్యాంకర్లలోకి తోడుతున్నారు. కొన్ని చోట్ల రోడ్లను, డ్రెయినేజీలను పగలగొడుతున్నారు. ఇక విలీన గ్రామ పంచాయతీల్లో ఖాళీ స్థలాల్లో చేరిన వర్షపు నీటిని అధికారులు జేసీబీలతో కచ్చా కాల్వలు కొట్టించి తొలగిస్తున్నారు.

ముసురేసింది..

గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో శనివారం చెరువులు, వాగుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. పలు చోట్ల అలుగు పారడంతో కొందరు చేపల వేట కొనసాగించారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పత్తి, మిరప చేలల్లో నీరు చేరింది. ఇన్నాళ్లు సరిపడా వర్షాలు లేక ఇబ్బందులు పడ్డ రైతులు వరి సాగును ముమ్మరం చేశారు. పలు చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా.. అధికారులు, ప్రజాప్రతినిధులు ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: పొంగి ప్రవహిస్తున్న ప్రకాష్‌నగర్ చెక్ డ్యాం



రఘునాథపాలెం: రాంక్యాతండా,పుటానితండా మధ్య రోడ్డుపై పారుతున్న వరద



కామేపల్లి పాఠశాల ఆవరణంలో నిలిచిన వర్షపు నీరు



తిరుమలాయపాలెం: పత్తి చేనులో ఇలా..



ఖమ్మంలో చెక్ డ్యాం వద్ద చేపలు పడుతున్న స్థానికులు

నేడు నెలనెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నెలనెలా వెన్నెల 84వ అభ్యుదయ సాంస్కృతిక కదంబం ఆదివారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఎ.సుబ్రమణ్యకుమార్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం తెలుగు కళాసమితి వారిచే 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?'నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి కళాభిమానులు, కళాకారులు, పట్టణ ప్రజలు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

అప్రమత్తంగా ఉండాలి..



సుర్దేపల్లి కాజ్‌వేను పరిశీలిస్తున్న సీఈఓ వినోద్

నేలకొండపల్లి: వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ వినోద్ సూచించారు. మండలంలోని బుద్ధారం, సుర్దేపల్లి, చెన్నారం గ్రామాల కాజ్‌వేలు, పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాజ్‌వే ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని, వ్యాధుల బారిన పడకుండా శానిటేషన్ పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాన దెబ్బకు కూలిన ప్రహరీ, ఇంటి గోడ..



ఖమ్మంఅర్బన్: వర్షానికి కుప్పకూలిన కియా కారు షోరూం ప్రహరీ



తిరుమలాయపాలెం: బీరోలులో దామళ్ల విజయ ఇంటి గోడ కూలిన దృశ్యం

ఖమ్మంఅర్బన్/తిరుమలాయపాలెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నగరంలోని గోపాలపురం వద్ద ఉన్న కియా కారు షోరూం చెందిన ప్రహరీ కుప్పకూలింది. చింతకాని మేజర్ కాల్వ పక్కనే, గొల్లగూడెం చెరువు సమీపాన ఉండడంతో వరద తాకిడి, నానుపు వానతో గోడ మట్టంకు కుప్పకూలింది. సుమారు రూ.30 లక్షలపైగా నష్టం జరిగిందని షోరూం నిర్వాహకులు తెలిపారు. అలాగే తిరుమలాయపాలెం మండలం బీరోలులో దామల్ల విజయ ఇంటి గోడ కూలిపోయింది. ఈ సమయాన ఆమె ఇంట్లోనే ఉన్నా.. వేరే పక్కకు పడడంతో ప్రమాదం తప్పింది. తనను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటుంది.

ప్రమాదకరంగా గుంత..



బూడిదంపాడు సెంటర్‌లో స్థానికులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

రఘునాథపాలెం: మండలంలోని ఖమ్మం–ఇల్లెందు రోడ్డులోని బూడిదంపాడు ఏస్సీ కాలనీ వద్ద తారు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. జోరువానతో అవి మరింత పెద్దగా మారి కనపడక శనివారం వాటిలో పడి పలు వాహనదారులు గాయాలపాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్తులు ప్రమాద హెచ్చరిక తెలిపేలా డ్రమ్ములు, కర్రలను అడ్డుగా పెట్టారు. ప్రమాదాలు పెరగక ముందే అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలి



కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కిన్నెర నారాయణ, దున్న గురవయ్యలు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేఎంసీలో పనిచేస్తున్న 900 మంది కార్మికులకు రక్షణ పరికరాలు లేక గాయాలపాలవుతున్నారన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రోడ్లు మురుగుమయం అవుతుండడంతో గ్లౌజ్‌లు, కోట్‌లు లేక పనుల సమయాన ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ములకలపల్లి లక్ష్మీనారాయణ, కె.శ్రీనివాస్, మోహన్ ప్రసాద్, బాబురావు, పుల్లారావు, పార్థు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి



నేలకొండపల్లి: మాట్లాడుతున్న హెచ్‌ఎం గురవయ్య

ఖమ్మంఅర్బన్/నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖమ్మంఅర్బన్ మండల విద్యా శాఖాధికారి బి.శ్రీనివాస్, మంగ్రాజుపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.గురవయ్య కోరారు. శనివారం తెలంగాణ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ (పీటీఏ) సమావేశం నిర్వహించగా.. యూపీఎస్ వేణుగోపాలనగర్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ, మంగ్రాజుపల్లి పాఠశాలలో గురవయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, హాజరు శాతం, ప్రవర్తన, పాఠశాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో ఏఏపీసీ చైర్మన్ గోపికుమారి, వేణుగోపాలనగర్ పాఠశాల హెచ్‌ఎం గుడిపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కె.హైమావతి, నాగుల్‌మీరా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్ సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలో సాధారణ బదిలీల ప్రక్రియ ముగియడంతో శనివారం పలువురు ఆయా పోస్టుల్లో విధుల్లో చేరారు. డీఈఓ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్లు ఎర్రమల్ల శ్రీనివాసరావు, కే.వీ.మాధవరావు, బి.నగేష్, బి.సుధీర్‌ను డైట్ కళాశాలకు కేటాయించగా..వారు అక్కడ విధుల్లో చేరారు. అలాగే, మరికొందరిని పాఠశాలలకు కేటాయించారు.

ఖమ్మంక్రైం: పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై బదిలీ అయిన పి.రామును శనివారం సన్మానించారు. అలాగే, పోలీసు శాఖలో 20 ఏళ్ల పాటు పనిచేసి డాక్టరేట్ పొందిన జే.ఎస్.కే.తులసీదాస్‌ను సైతం సన్మానించారు. అడిషనల్ డీసీపీ నరేష్‌కుమార్, కార్యాలయ ఉద్యోగులు అక్తరునీసా బేగం, జానకీరాం, యాసిన్ షరీఫ్, రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం లీగల్: ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు ఏపీపీ నర్సింగ్ అనిల్‌కుమార్ కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ అయ్యారు. ఆయనను రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి ఏపూరి బిందుప్రియ, న్యాయశాఖ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు రాజు తదితరులు సన్మానించారు.

వంద పడకల ఆస్పత్రిని తరలించొద్దని ధర్నా



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న అఖిలపక్షం నాయకులు,గ్రామస్తులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మంజూరైన వంద పడకల ఆస్పత్రిని తరలించే ఆలోచనను విరమించుకోవాలని, ఇక్కడే కొనసాగించి పనులను ప్రారంభించాలని అఖిలపక్షం ఆధ్వర్యాన శనివారం ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.26 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, నాటి నుంచి డిప్యూటేషన్‌పై ఖమ్మం నుంచి వైద్య సిబ్బంది వచ్చి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సమయాన ఆస్పత్రిని కూసుమంచికి తరలించాలని చూడడం సరికాదని, ఈ విషయంపై మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల మండల వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు కొమ్ము శ్రీను, మట్టి దుర్గాప్రసాద్, కొలిచలం స్వామి, వెంకటేష్, ముత్తయ్య, కొమ్ము వెంకన్న, వీరస్వామి, బుచ్చి రాములు, కిరణ్, సౌభాగ్యం, నాగరాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌టీల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఖమ్మం సహకారనగర్: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీలకు (కాంట్రాక్టు టీచర్లకు) పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, అంగన్‌వాడీలను ప్రీస్కూల్స్‌గా మార్చి మూడో తరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఆర్టీలకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవడం ఇబ్బందికరంగా మారిందని, ప్రతి నెలా 1వ తేదీన వేతనం జమ అయ్యేలా చూడాలని, మినిమం బేసిక్ పే ఇవ్వాలని, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సెలవులు, ఇతర ప్రయోజనాలు సీఆర్టీలకు వర్తింపచేయాలన్నారు. అలాగే, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్‌గా మార్చాలనే ప్రతిపాదనను ఆహ్వానించతగినదన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో తగినంత బోధన, బోధనేతర సిబ్బంది ఉండేలా చూడాలన్నారు.





మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎస్. ఉపేందర్ - 99591 24151 | మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957